

# కనిపించని సాక్షి

వి.కె.చైతన్య



'ఏసిబి దాడిలో రెవిన్యూ అధికారి' ఆ చిన్న వాక్యం పేపర్‌లో చదువు తుంటే ఎప్పటిలాగే గుండె దడ దడ లాడింది. ఎప్పుడో నా పేరూ ఇలాగే పేపర్లో వస్తుందేమో అని.

ప్రతి రోజూ పేపర్లో ఈ వార్తలుంటున్నాయి. అనలు నాకళ్ళకే ఈ వార్తలు కనిపిస్తాయో!

"కాఫీ తీసుకోండి" ఇందు తెచ్చిచ్చిన కాఫీ చప్పరిస్తూ మిగతా వార్తలు చదువు తుంటే, పక్క పోర్షన్ లోంచి సామానులు సర్దుతున్న శబ్దం.

మూర్తి వాళ్ళు వచ్చేశారా ఏంటి? అదే ఇందూని అడిగేను.

రాత్రే వచ్చారు గదండీ, సామానంతా లారీలో తెచ్చేసుకున్నారు.

"డాడీ! కొత్తంకుల్ వాళ్ళింట్లో టీ.వీ. లేదుగా? వాళ్ళ క్రాంతీ చందూ స్పైడర్ మాన్ ఎలా చూస్తారు?"

డైనింగ్ టేబిల్ ముందు కూర్చుని పాలు తాగుతున్న చింటూ సందేహం, నా కో క్షణం నవ్వొచ్చింది ఈ కాలం పిల్లల ఆబ్జర్వేషన్‌కి. రాత్రే మా ఇంట్లోకి అద్దెకు దిగింది వాళ్ళు, అప్పుడే వాళ్ళింట్లో ఉన్నవేంటో - లేనివేంటో కనిపెట్టేశాడన్న మాట!

"అతనొక్కడే కాదటండీ ఆవిడా టీచరేనట. ఇందూ ఏమిటో చేప్పేస్తూంది. ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడం, తద్వారా కట్టుకున్న వాడికి వాళ్ళిచ్చే మర్యాదలు పిల్లల పెంపకం వగైరా.

నా కవేమీ వినిపించడం లేదు. నిన్న సాయంత్రం - 'డి యస్ ఓ' పిలిచి రేపటికి

పాతిక్కిలోలు పామోయిల్, మగర్ పంపించమన్న విషయం కదులుతోంది మస్తిష్కంలో. సివిల్ సప్లయిస్‌లో నా ఉద్యోగానికి. అందులో డీలర్ పర్మిట్ సెక్షన్. ఇలాంటి అన్ అఫిషియల్ ఆర్డర్లివ్వడం ఆయనకూ ఆ పని చేయడం నాకూ మామూలే!

వచ్చిన చిక్కల్లా పేపర్లో ఇలాంటి వార్తలు. చేయాల్సిన పని ఒకే రోజు క్రాస్ అయినప్పుడు కొంచం 'ఆదోలా' ఉంటుంది.

ఆఫీసుకి - మద్యాహ్నాం పక్క ఊరి డీలర్ వస్తే చెప్పాను. "మా ఇంటికి టిన్ పామోయిల్, మగర్ ఇరవై కిలోలు పంపింవోయ్ మధూ!" అని.

ఓ నిమిషం ఏ సమాధానమూ చెప్పలే దతను. ఏమిటో సంశయిస్తున్నట్టున్నాడు. అతన్ని చూస్తే తెలుస్తూనే ఉంది.

"ఏమిటి .. ఆలోచిస్తున్నావ్?"

"అంతంటే ఎలా సార్, మీకు తెలీందేముంది? జనాలంతా తెలివి మీరి పోయి ఎవ్వరూ రేషన్ వదులు కోవడం లేదు. ఇక మాకు దాంట్లో మిగిలే మార్జిన్ ఏవుంటుంది? మీరు మమ్ము ల్నో చూపు చూడాల్సార్!"

" నా ఇంట్లో పెళ్ళుటయ్యా! 'డియస్‌ఓ' గారి కయ్యా బాబూ! ఆయననీకు చెప్పమన్నారు. మరి నీ ఇష్టం. రాజు తలుచు కుంటే దెబ్బల క్కొదవా నీ డీలర్ షిప్ జాగ్రత్త!"

"బి - ఫోర్ పై లిటియ్యి వోయి లింగం!"

మరోసారి అతని కేసి చూడకుండా అవసరం లేని హడావిడిలో దూరిపోయాను. కాసేపటి తరువాత ఆ జీవి కదిలి పోయాడు.

నవ్వొచ్చింది. కీలెరిగి వాత పెట్టడం అంటే ఇదే! అసలు 'డియస్‌ఓ' కి వీడెవడో తెలుసా? జిల్లాలో ఉండే ముక్కోటి లింగాల్లో ఇదో బోడి లింగం. అయినా ఈ మాత్రం ట్రిక్ తెలీక పోతే ఇల్లంతా గల్లు గల్లు మని శబ్దం చేస్తూ లక్ష్మీదేవి వెయ్యి దాటని గవర్నమెంటు సర్వెంటుగా రింట్లో తిరుగుతు'ందా?

అనుకున్నట్టుగానే రాత్రి ఇంటికెళ్ళే సరికి, ఆయిలూ, దాంతో పాటు మగరూ ఉన్నాయి.

ఇందూకి చెప్పాను... రెండిట్లోంచి తలో ఐదు కిలోలు తీసి ఇంట్లో ఉంచమని. ఆఁ.. మిగతా దే పోయింది 'డియస్‌ఓ' ఇంటికి.

"రేపు చింటూ పుట్టిన రోజు కదా. మీ ఆఫీస్‌లో వాళ్ళని పిలుస్తారా?" భోజనం చేస్తుండగా అడిగింది ఇందు.

"పోనిద్దూ! వాళ్ళ నింటికి ఫంక్షన్‌కి పిలిచే మంటే ఇవన్నీ చూసి ఏడ్చి చస్తారు. ఇప్పుడే డియస్‌ఓకూ నాకూ మంచి సంబంధా లున్నాయని ఏడుపు. మన కాలనీ వాళ్ళనే పిలువ్. రేపు నాలుగింటికే వచ్చేస్తాన్లే ఆఫీసు నుంచి"

మర్నాడు...

మూడున్నర నుంచే బయట పడ్డానికి ఎంత ప్రయత్నిస్తున్నా వీలు దొరికితేనా? ఎవడో వస్తాడు. బియ్యం పర్మిట్లు, కిరసనాయిల్లు మధ్యలో దొరగారి అత్యవసర పిలుపులు. వీటన్నిటి మధ్యా గడియారంలో ముల్లు 'ఆ మూడున్నర' దగ్గరే ఆగిపోమంటే ఆగుతుందా?

"ఏందో సారు! వారంలో ఏడు రోజులు పోని ... ఒక్క రోజైనా గుడికిబోయి గింత అయ్యవారుతో తీర్థం తీసుకోవా లంటుంది ఇంట్ల! గా మాట రొండు చేవులల్ల గింత గింతన్న దూరది! ఇక మీకాడికి రాకుంటే దేవుడేం జేత్తడో తెలది గాని గీ కానూన్ తోటి పెద్ద పరేశాన్!"

రావడం - రావడంతోనే దండకం మొదలు పేట్టేశాడు నర్సిరెడ్డి. దాంతో పాటు రైను మిల్లు ప్రపోజలు - అది 'డియస్‌ఓ'కి చేరాల్సిన సంగతి ఇత్యాది.

"మీరు గమ్మత్ మాట్లాడ వడితిరి! పెద్ద ఆఫీసర్లంటే దేవుడనుకున్నారా? గిట్ల దండం బెట్టుకుని కోరిక చెప్తె ఇననీకి? సాయంత్రం 'కపిల' హోటెల్లో కూకుందాం. గాయన్నొట్టయినా తీసురాని!"

"ఆయనొప్పు కోడయ్యా ఇలాంటి వాడికి!" అసలు ఇతన్దగ్గరున్న నా ప్రపోజల్ ఏమయ్యిందో అన్నదే - నా ఉద్దేశం - కాని డియస్‌ఓ ఒప్పుకో డన్నది కాదు.

"గవన్నీ మిమ్మల్ని సూసుకోమనే గాదు మీకు జెప్పేద్ది? నిన్ను గిట్ల మర్సి పోయేద్ది లేదు. గదేం పరేశాన్ వద్దు. కవర్తి నగర్ ప్లాటు కర జేసిన గవన్నీ రాత్రి మాట్లాడత. మరి పోత!"

ఇక చాలు నా కివ్వాల్సిన అభయం ఇచ్చేశాడు. కాని, కొద్ది నిముషాలు చిన్న సందిగ్ధం. చింటూ గాడి బర్త్ డేనా? నర్సిరెడ్డితో సిట్టింగా?




పెద్ద సమస్యేమీ లేకుండానే మళ్ళీ మూడొందల రోజుల్లో వచ్చే పుట్టిన రోజు ఐదారు వేలు జేసే ప్లాటు ముందు ఓడి పోయింది.

రాత్రి ఒంటి గంటకి డియస్‌ఓని వాళ్ళింట్లో నా స్కూటరు మీద [ఇల్లాంటి మందు పార్టీలకి - ఆఫీసు జీపు వాడుకోడండి మా బాసు] దింపేసి ఇంటికి తిరిగి వస్తుంటే, మళ్ళీ ఇప్పు డనిపిస్తోంది.

"డాడీ లేంది, నేను కేక్ కొయ్య"నని చింటూ గాడు మారం చేస్తున్నాడేమో ఇంకా అని.

ఏదో బ్రతిమాలి కోయించినా, అన్నం తినసని ఏడుస్తున్నాడేమో నిద్దరోకుండా.

ఈ రెండు పనులు వాడినేదో బ్రతిమాలి చేయించి తను మాత్రం ఇంకా భోం చెయ్యకుండా చూస్తూ కూర్చు నుంటుంది పిచ్చి ఇందూ! పిల్లలిద్దరూ నిద్రపోయి ఉంటారు. ఇద్దరం ఒకే కంచంలో అన్నం కలుపుకుని, చెరో ముద్దా ముద్దుగా ముద్దు లెట్టుకుంటూ తినాలి. ఎన్నాళ్ళై పోయిందో. ఇందూతో కలిసి భోం చేసి!

ఒళ్ళంతా తిమ్మిరెక్కి పోయింది. స్కూటర్ స్పీడ్ రెయిజ్ అయ్యింది, ఆటోమాటిగ్గా. కాని ... ఇల్లు చేరే వరకు చింటూ ఏడుపు, "ఊహూ!"

ఇందూ గడపలో కూర్చుని కళ్ళలో వత్తు లేసుకుని ఎదురు చూడ్డం లేదు. ఇంట్లో దీపాలన్నీ ఆర్పేసి హాయిగా నిద్దరో తున్నారు. కాలింగ్ బెల్ మోతకి చిరాగ్గా లేచిన ఇందూ "అబ్బ! ఇప్పటి దాకా తిరక్కపోతేనేం ..." మళ్ళొచ్చి మంచం మీద పడిపోయి క్షణంలో నిద్రలోకి జారి పోయింది.

ఇల్లంతా చిందర వందర గా ఉంది.

ఇన్ని ఎత్తు లేసి ట్రిక్కులు ప్రయోగించి - నర్సిరెడ్డి తరపున డియస్‌ఓ ని కాకాపట్టి ప్రతి ఫలంగా ఖరీదైన ప్లాటు చవగ్గా కొట్టేశానన్న ఉత్సాహం, సంతోషం ... "ఉఫ్" మని ఊదేసినట్టు ఒళ్ళంతా చల్లబడి పోయింది.

బట్టలు మార్చుకుని పడుకున్నా నిద్ర రావడం లేదు. గడియారంలో పెండ్యూలం టిక్.. టిక్ మని కదులుతూనే ఉంది. క్షణాల్ని దొల్లించు కుంటూ!

మొదటి సారిగా నాలో అసంతృప్తి కదలిక!

* * * * *

అర్జెంటుగా ఆఫీసు పని మీద హైద్రాబాద్ వెళ్ళాల్సి వచ్చింది. అందుకే ఎప్పుడూ లేంది ఐదు గంటలకే ఆఫీసు నుంచి వచ్చేశాను. త్వరగా బట్టలు, ఫైల్స్ సర్దుకున్ని స్టేషన్‌కి వెళ్ళాలి గదా! స్కూటర్ పోర్టికో లోకి తీసుకొచ్చాను.

మూర్తి ఇద్దరు పిల్లలు ఆవిడ తన భార్య కాబోలు, నన్ను చూసి చాప మీద నుంచి లేచి కొద్దిగా పోర్టికో లోంచి గడపలోకి తప్పు కుంది. చాప పక్కనే వాలు కుర్చీలో కూర్చుని పేపర్లు దిద్దున్నాడు మూర్తి.

"హల్లో మూర్తిగారు! అంత సీరియస్‌గా మార్కు లేస్తున్నారు. అందర్ని పాసు చెయ్య బోకండి ఉద్యోగాలు లేవు" అన్నాను.

నవ్వేశాడు మూర్తి. వాళ్ళొచ్చిన పది రోజుల్లో ఏ రెండు సార్లు ఎదురు పడ్డామో!

త్వరగా 'ఫ్రెష్' అయ్యి 'టీ' తాగేసి, రెండు జతల బట్టలు ముఖ్యమైన కాగితాలు బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకుని హడావిడిగా ఆరు గంటల బస్సుకి బయలు దేరాను.

బస్సులో కూర్చొన్నా 'లిప్త' పాటు కళ్ళ బడిన ఆ దృశ్యం చాలా బావున్నట్టు మధురంగానూ అనిపించింది.

సాయంత్రం వేళ అలా పిల్లల్తో చాప మీద

కూర్చుని వాళ్ళకి పాఠాలు చేప్తూంటే, భుజం మీదగా ముందికి జారిన వత్తైన జడ తనూ శ్రద్ధగా వింటున్నట్టనిపిస్తోంది.

ఆ వక్కనే వాలు కుర్చీలో హాయిగా పుస్తకం చదువు కుంటూనో ... రాసుకుంటూనో మూర్తి.

చల్లటి వేళ

పిల్లలతో కాలం ఆనందంగా పంచుకుంటున్న ఆ వేళ

ఎందుకో బాగా నచ్చింది.

నాలో మత్తుగా నిద్దరోతున్న భావుకుడు ఒళ్ళు విరుచుకుని లేచినట్లైంది. ఈ లంచాల బలహీనతలో డియస్‌ఓ కి అయిన పనికీ - కాని పనికీ నేనే కావాలి. కాదూ - కూడదు అంటే నా బలహీనతలు తెలిసిన మనిషి ప్రోత్సాహిస్తున్న మనిషి. అతన్ని కాదనడమా?

ఎప్పూడూ ఆరు గంటల లోపు ఇంటి కెళ్ళలేదు. భార్యా పిల్లలతో గడిపిన క్షణాలే తక్కువ! ఏమిటి 'స్తబ్దుగా'- 'నిర్లిప్తంగా' అనిపిస్తున్నాయి. జరిగిపోయిన రోజుల్ని తెలును కుంటుంటే! డీలక్స్ బస్సులోని కుషన్ సీటు రాయిలా అనిపిస్తోంది. రాత్రి పదకొండ వుతుండగా బస్సు హైదరాబాద్ చేరింది. బస్సు దిగీ దిగ్గానే అప్పటీ వరకూ నాతో వాదోపవాదాలు పెట్టుకున్న భావుకుడు మళ్ళీ మత్తులోకి జారి పోయాడు.

* * * * * * *

మూడ్రోజులు తరువాత హైద్రాబాద్ నుంచి తిరిగి వచ్చేవరకు ఇందూ తాళం మూర్తి గారింట్లో ఇచ్చి ఊళ్ళో ఉన్న వాళ్ళ పిన్ని గారింటికి వెళ్ళిందట. తాళం తీసుకుని స్నానం చేసి తలదువ్వు కుంటూంటే మూర్తి కాఫీ తీసుకొచ్చాడు.

"అరెరే మీ కెందు కా శ్రమ, ఫ్రిజ్‌లో పాలుండేఉంటాయి. నే కలుపుకునే వాణ్ణిగా?"

"దీంట్లో శ్రమేం ఉందండీ! ప్రయాణం చేసి వచ్చారు గదా! రిలాక్స్‌గా ఉంటుంది తాగండి!"

కాఫీ తాగుతూ ఇద్దరం మాట్లాడు కుంటూ కూర్చున్నాం. మెల్లగా మా సంభాషణ ఇల్లు, పిల్లలు, పుస్తకాలు, సాహిత్యం లాంటి విషయాల మీది కెళ్ళింది. చక్కగానూ, విపులం గానూ మాట్లాడు కున్నాం.


తృప్తికి ఇది మాత్రమే కారణం కాదు. గుండెల్లో దాగి ఉండే ఇష్టాన్ని గొంతులో జేర్చి ... అలా! చాలా రోజులు తరువాత ఓ గాఢమైన సుషుప్తిని చీల్చుకుని మేల్కొన్న జీవి అనుభూతుల అంచుల్ని ఆర్తిగా స్పృశించినట్టు దాదాపు ఈ ఐదారేళ్ళలోనూ డబ్బు, డిన్నర్‌లు, లంచాలు - మందు పార్టీలను మినహాయిస్తూ సాగిన మా సంభాషణ ... గుండెల్లో ఎక్కడో దాగిన అనుభూతుల అస్తిత్వాన్ని - సున్నితంగా తాకి మధురమైన భావనకు లోనైనట్ల నిపించింది!

"నాన్నా! అంకుల్‌నీ మిమ్మల్నీ అమ్మ భోజనానికి రమ్మంటోంది" వాళ్ళ బాబొచ్చి పిలిచేడు.

ఎందకనో అడ్డు చెప్పాలని పించ లేదు. ఇంకాస్త ఆనందాన్ని పొందాలని పించడం వల్లేమో! నేనూ, మూర్తీ ఇద్దరం వాళ్ళ పోర్షన్‌లో కెళ్ళాం.

వీ ళ్ళీ ఇంట్లోకి దిగేక ఇది మొదటిసారి లోనికి రావడం.

కిటికీ వక్కగా మెట్లు పైకి పాకిన సంపెంగ తీగకు పూసిన ఓ సంపెంగ పరిమళం ఇల్లంతా




మత్తుగా అలుముకుంది.

ముందు గదిలో నాలుగు కుర్చీలు ఓ టీపాయి తరువాతి గదిలో రెండు మంచాలు, శుభ్రంగా ఉతికి వేసిన బెడ్ షీట్స్. ఒక మూల టేబిలు, దాని మీద పెన్ స్టాండ్, ఏదో రాస్తూ - రాస్తూ ఆపిన కాగితాల బొత్తి. గోడకున్న పుస్తకాల షెల్ఫు దాన్నిండా పుస్తకాలు టేబిల్ మీద స్ఫటికపు రాయితో చేసిన బుద్ధుని విగ్రహం. నిశ్శబ్దంగా మూసిన ఆ కనురెప్పల మాటు నుంచి ఏదో ప్రశాంతత జాలువారు తున్నట్లు ఇల్లు చాలా నీట్‌గా ప్రశాంతంగా ఉంది. మూడో గదిలో భోజనాల బల్ల దగ్గర మూర్తి భార్య గిన్నెలు సర్దుతోంది.

"నా మిసెస్ విద్య...!"

"నమస్తే!"

ఆవిడా ప్రతి నమస్కారం చేసింది. ముగ్గురం కలసి భోం చేస్తుంటే తెలిసింది. 'విద్య' కథలు రాస్తుందట. నా కా జంటను చూస్తున్న కొద్దీ ఏదో నిండు తనపు ఫీలింగ్ మరింత ముచ్చట గొలువుతోంది! అప్పుడప్పుడు ఇంట్లో అందరం కలసి భోం చేసినా నా ఆలోచన లెప్పుడూ ఆఫీసు; ఆ వేళ రావలసిన కష్టమర్స్ [నా దృష్టిలో], వాళ్ళు తెచ్చే బరువులు, దాని తాలూకు నా షేరు - వీటి మధ్య భోంచేసినా ఆదేదో హొటల్‌లో తిని లేచినట్టుండేది. ఈ వేళ - చాలా డిఫరెంట్‌గానూ బురద లోంచి లేచొచ్చి శుభ్రంగా ఒళ్ళు కడుక్కున్న ఫీలింగ్!

తరువాత ఓ అర్థ గంటకి ఇంట్లోకి వచ్చి పడుకున్నాను. ఎందకనో నిద్ర రాలేదు. కూలర్ గాలి వేడిగానూ డబుల్ కాట్ మీద మెత్తటి పరుపు నిండా దురదగొండాకున్నట్లు మనసులోని అస్తిమితం గదంతా నిండి పోయి ఆదోలాంటి 'లేమి' భావం వీటన్నిటి మధ్యా - రాత్రెప్పుడు కరిగి పోయిందో!

మూడో రోజు ఆఫీసు కెళ్ళాను. పదకొండై పోయింది. చాలా నిశ్శబ్దంగా ఉంది మా ఆఫీస్. అంతా మౌనంగా ఏమిటో అసహజత ఆ మౌనంలో.

తరువాత రెండు నిముషాల్లో తెలిసి పోయింది. నర - నరాల్లోనూ భయం తాలుకు ప్రకంపనలు. మరో సారి ఇంకోసారి గుండె దడ దడ లాడి పోయింది.

మా సెక్షన్ హెడ్ - 'ఏసిబి' కి దొరికి పోయి సస్పెండ్ అయ్యాడట! అందుకే ఈ మౌనం.

ఆఫీసులో ఈ నిశ్శబ్దం రాజ్యామేలే రోజు నా కొకటుందేమో! వెయ్యి రూపాయల క్లర్కుకి రెండు లక్షల ఇల్లెక్కడిదని అడిగితే - సమాధానం చెప్ప గలిగే పూర్వపు ఆస్తులే మున్నాయి? నా లంచాలు ఎక్స్‌పీరియన్స్ మినహాయించి! ఇంట్లో ఫర్నిచర్, స్కూటరు. మనస్సంతా పరి పరి విధాల కీడును శంకిస్తోంది.

ఆఫీసులో రోజూ లానే రాత్రి తొమ్మిదింటి దాకా చెయ్యాల్సిన పనులున్నాయి. అయినా ఉండా లనిపించ లేదు. ఐదింటికే ఇంటికి బయలు దేరాను.

అదే దృశ్యం! పోర్టికోలో చాప మీద పిల్లల్ని కూర్చో బెట్టుకుని, విద్య పాఠాలు చెప్తూంది. మూర్తి వక్కనే వాలు కుర్చీలో కూర్చుని 'టీ' తాగుతూ 'ఏదో పుస్తకం చదువు కుంటూ!

ఆ ముఖంలో అదే ప్రశాంతత. ఆ చిర్నవ్వులో ఆదే స్వచ్ఛత. అలా బ్రతకడంలో ఎంత హాయి! మరెంత నిశ్చింత!

మామూలుగానే రాత్రి లానే, రాత్రి పదకొండై పోయినా నిద్ర రాలేదు.

ఇందు హాయిగానే ఉంది. పిల్లలూ సంతోషంగానే ఉన్నారు. కేవలం నన్నే ఏదో 'లేమి' బాధిస్తోంది.

చాలా సేపటికి ఎప్పుడో రాత్రంతా కరిగి పోతుండగా ఓ వేగు చుక్క ఫక్కున నవ్వుతున్నప్పుడు. అలా కిటికీ లోంచి ... చిక్కని చీకటిని చీల్చు కుంటూ ఆకాశాన్ని ... నిశ్శబ్దంగా అలుముకుంటున్న వెలుగుని చూస్తున్న వేళ ఈ అశాంతికీ, అస్తిమితానికీ కారణ మేంటో అర్థమ వుతూంది. నన్ను బాధిస్తున్న 'లేమి' ఏమిటో నా రెండు లక్షల ఇంట్లో రెండొందల కిరాయిస్తూ - మూడు గదుల ఇంట్లో ఉంటున్న మూర్తి 'కలిమి' ఏమిటో! వాళ్ళ కున్న నిశ్చింతేది? భద్ర తేది నాకు? ఏమిటి - 'లంచాలు' ... 'లంచాలు' మామూలు జీవితంలో 'జీతంలో సంపాయించుకోని సుఖం దీంట్లో దొరుకుందేమో అనుకుంటే ప్రతి క్షణం గిల్టీనెస్ అనుక్షణం టెన్షన్.

పట్టానికి దోషిగా దొరకడానికి సాక్ష్యాలు కావాలి.

'సస్పెండయినా' - 'శిక్ష' అయినా, కాని మామూలు - సుఖం - సంతోషం ప్రశాంతత దొరకనియ్యకుండా అనుషణం శిక్షించే మనస్సాక్షి అనేదొకటుంది, అది చాలు నా తప్పులకి సాక్షి!

★